18వ

సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

మంగళవారం,25 మార్చి 2025 | 8 పేజీలు

# విమాన గోపుర స్వర్ణమయ పథకానికి 2 లక్ష 50 వేలు విరాళం



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** చిన్న వెంకన్న ఆలయవిమాన గోపుర స్వర్ణమాయ పథకానికి విజయవాడ నగరానికి చెందిన ఎన్.నరసింహారావు, సాయిబాబు, కొల్లి చంద్ర మోహన్ రూ.2 లక్షల 50 వేలు విరాళాన్ని ఆలయ ఆఫీస్ వద్ద సిబ్బందికి అందజేశారు. దాతకు దేవాలయ ఏఈఓ నటరాజ్ బాండ్ పత్రాలను ప్రసాదాలను అందించి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి అభినందించారు.

# మామిడి పరిశోధనా ఫలితాలు లాభసాటిగా ఉండాలి..

- రూ.30 కోట్లతో నూజివీడు మార్కెట్ యార్డ్ అభివృద్ధి
- రైతులు మామిడి నాణ్యత పెంచితే ఎయిర్ కార్గో సేవలు - మంత్రి కొలుసు పార్థసారథి





**నూజివీడు,మేజర్‌న్యూస్ :** నూజివీడు మామిడికి మరింత ఇమేజ్ చేకూర్చి రవాణా సౌకర్యాలు మెరుగు పరిచేందుకు నూజివీడు మార్కెట్ యార్డును 30కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడు మామిడి పరిశోధన కిసాన్ మేళా ,వర్కుషాప్ నూజివీడు పట్టణంలో నాగేంద్ర వరలక్ష్మి కల్యాణ మండపంలో సోమవారం జరిగింది.మామిడి పరిశోధన మార్కెట్ సౌకర్యాల,మామిడి రైతుల రాబడి రైతులు ఎదుర్కొం టున్న సమస్యలపై వర్క్‌షాప్‌లో చర్చించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర గృహ



నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి వర్క్ షాప్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించి,రైతులు,వ్యాపారస్తులు, అధికారు లను ఉద్దేశించి మాట్లాడుతూ నూజివీడు మామిడికి జాతీయ, అంతర్జాతీయ

- తరువాయి 2లో..

# 27న ముఖ్యమంత్రి పోలవరం పర్యటన

- సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్,జేసీ





**పోలవరం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 27వ తేదీన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణపనుల పరిశీలన చేసేందుకు విచ్చేయుచున్న దృష్ట్యాముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విసోమవారం ప్రాజెక్ట్ సైట్‌లో పరిశీలించారు. అనంతరం ప్రాజెక్ట్ సైట్ సమావేశపు హాలులో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించేం దుకు పోలవరంవిచ్చేస్తారని,ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులందరూ పటిష్టమైన ఏర్పాట్లు చేయాల న్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులలో డయాఫ్రమ్ వాల్, అప్పర్ కాఫర్ డాం,లోయర్ కాఫర్ డాం, గ్యాప్1, గాప్ 2, వైబ్రో కంప్రెషన్, తదితర పనులను పరిశీలించే అవకాశం ఉందన్నారు. అనంతరం



అధికారులతో సమీక్షిస్తారన్నారు. ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించే ప్రదేశాలలో పనుల ప్రగతి సూచించేవిధంగాఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి, వివరాలు సీఎంకి తెలపలన్నారు.ఆయా ప్రదేశాలలో ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియ మించడం జరుగుతుందని కలెక్టర్‌చెప్పారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేయాలనీ పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు వచ్చే శాసనసభ్యులు

- తరువాయి 2లో..

# గంధం బోసు హత్యకు వివాహేతర సంబంధమే కారణం

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య

సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు వెల్లడి



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** మానవత్వం మరిచి శారీరక సుఖం కోసం భర్తను హత్య చేయించింది ఓభార్య.తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతో కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి హత్య చేసిన సంఘటనపై జీలుగుమిల్లి పోలీసులు మృతుడు భార్యను,ఆమె ప్రియుడిని సోమవారం అరెస్టు చేశారు.ఈ సందర్భంగా జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు,ఎస్సై పి.నవీన్‌కుమార్

- తరువాయి 2లో..

# గృహ నిర్మాణ ప్రాజెక్టులకు రూ.226.7 కోట్లు మంజూరు

- ఎంపీ పుట్టా మహేష్‌కు సమాధానం ఇచ్చిన కేంద్రమంత్రి



**ఢిల్లీ/ఏలూరు,సూర్యబ్యూరో :** గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు జిల్లాలో మధ్యతరగతి వర్గాల గృహాల కోసం ప్రత్యేక విండో కింద లబ్ధిదారులకు మంజూరు చేసిన నిధులు, వారికి అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. మధ్యతరగతి గృహాల కోసం ప్రత్యేక విండో ద్వారా నిధులు సమకూర్చబడిన ప్రాజెక్ట్‌ల కింద 50 వేల గృహాలు పూర్తయ్యాయని, 2025 ఫిబ్రవరి 28 నాటికి 40 వేల అదనపు యూనిట్లను పూర్తి చేయడానికి ఫండ్ సదుపాయం కల్పిస్తోందని కేంద్ర మంత్రి బదులిచ్చారు. ఆంధ్రప్రదేశ్ లోని రెండు ప్రాజెక్టుల్లో 970 గృహాలకు రూ.226.7 కోట్లు మంజూరు చేయగా, 2025 మార్చి 7నాటికి రూ.146.1కోట్లు

- తరువాయి 2లో..



# దేశాభివృద్ధికి 'ఒక దేశం-ఒకే ఎన్నిక' చాలా కీలకం

- ఏకకాలంలో ఎన్నికల వల్ల ఖర్చు తగ్గి అభివృద్ధికి మార్గం సుగమం - కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

**భీమవరం,మేజర్‌న్యూస్ :** ప్రపంచానికి భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దేందుకై వికసిత్ 2047 లక్ష్యంగా ప్రధానినరేంద్రమోడీ ముందుకు వెళ్తున్నారని, ఒకదేశం ఒకే ఎన్నిక అనేది దేశ అభివృద్ధికి ఎంతో కీలకమని కేంద్ర ఉక్కుభారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. డి.యన్.ఆర్ కళాశాల ప్లాటినం జ్యూబ్లీ సెమినార్ హాలులో సోమవారం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీజి.మోజెస్ అధ్యక్షతన

- తరువాయి 2లో..

# రైతుల వద్ద ఉన్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలి






**పెదవేగి,మేజర్‌న్యూస్:** కోకో రైతుల వద్ద ఉన్న ఆన్ సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో పెదవేగి మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ ధర్నాకు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆయిల్ పామ్ రైతు సంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకట్రావు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ సంవత్సరం కోకో రైతులకు తగిన ధర రాక, కంపెనీలు గింజలు కొనుగోలు చేయక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో తోటలు కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి దయనీయగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజలు పచ్చళ్ళు పట్టుకోండి అంటూ కొన్ని కంపెనీల ప్రతినిధులు రైతులను ఎగతాళి చేస్తూ రైతులను అవమానించడం దారుణమని విమర్శించారు. గత నెల రోజులుగా రోడ్లెక్కి కోకో రైతులు ఆందోళన చేస్తున్నారని అయినా కంపెనీల నుండి తగిన స్పందన లేదని, ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ సమక్షంలో కంపెనీలతో జాయింట్ మీటింగ్ జరిగినా కోకో గింజలు కొనుగోలు సమస్య పరిష్కారం రాలేదని చెప్పారు. ఒక్క పెదవేగి మండలంలోనే అన్ సీజన్ కోకో గింజలు 500 టన్నులకు పైగా రైతులు వద్ద నిల్వ ఉండిపోయాయని చెప్పారు. ఆన్ సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, విదేశీ కోకో గింజలు దిగుమతులు నిలుపుదల చేయాలని కోరారు. లేని పక్షంలో కోకో రైతుల ఆందోళన ఉధృతం అవుతుందని హెచ్చరించారు. అనంతరం మండల తహసిల్దార్ భ్రమ రాంబకు, మండల ఉద్యాన శాఖ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్ బాబు మరియు కోకో రైతులు బొప్పన పూర్ణచంద్రరావు, ఆర్.తేజ కృష్ణ, జగన్మోహనరావు, వై.లలితా కుమార్,కె.రామిరెడ్డి, జి. లక్ష్మణరావు,పి. ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**ఇరగవరం,మేజర్‌న్యూస్ :** ప్రజలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఇరగవరం సబ్ ఇన్ స్పెక్టర్ జానా సతీష్ చెప్పారు. జిల్లా యస్.పి ఆదేశానుసారం మండలంలోని రాపాకలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిం చినట్లు చెప్పారు. నేరాలు అదుపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నేరగాళ్ళు, మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపిల్లలు, మహిళలపై జరిగే అఘాయిత్యాలపై కఠినచర్యలు తీసుకుం టామని అన్నారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని దీనిపై అవగాహన ఉండాలని చెప్పారు. సైబర్ నేరాలకు ఎవరైనా పాల్పడితే గుర్తించి తమకి సమాచారం అందించాలని సూచించారు. చెప్పారు. ఎటువంటి నేరలను దృష్టిలో ఉంచుకుని రాత్రిసమయంలో గ్రామాల్లో గస్తీ ముమ్మరం చేసినట్లు వివరించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా, చిన్నపిల్లలు, మహిళలుపై ఎవరైనా నేరలకు పాల్పడితే కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేటి నుండి ఎపి పిఎస్‌సి పరీక్షలు : డిఆర్ఓ



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 25 నుండి 27 వరకు 4 వేర్వేరు పోస్టులకు పరీక్షను నిర్వహించనుందని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లాలో ఈ పరీక్షకు సమన్వయ అధికారిగా ఉన్న జిల్లా రెవెన్యూ అధికారి వారు సంబంధిత అధికారులందరితో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసారు. వట్లూరు నందు గల సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో చేసిన పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించారు. ఏలూరు జిల్లాలో పరీక్షను విజయవంతంగా పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన






**పెదపాడు,మేజర్‌న్యూస్ :** రాష్ట్రం న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్.ఎ.సి) ఎం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సోమవారం కలపర్రు గ్రామంలోని జడ్పీ హైస్కూల్ నందు విద్యార్థులకు బాల బాలికలపై అత్యాచారాల నిరోధక చట్టం పై అవగాహన సదస్సును నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం వివిధ పాఠశాలలకు హాస్టల్లోని విద్యార్థిని విద్యార్థులకు ఈ చట్టం పైన అవగాహన కలిగిస్తున్నామని అందులో భాగంగా కలపర్రులోని జడ్పీ హైస్కూల్ నందు ఈ న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశామని తెలియజేశారు. నేటి సమాజంలో జరుగుతున్న అత్యాచారాలను ఏ విధముగా ఎదుర్కొనాలి,అటువంటి సమస్యలు ఎదురైనప్పుడు ఎవరిని సంప్రదించాలి అనే అంశం పైన విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏలూరు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కుమారి బి రచన,తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వి.నాగ రంజిత్ కుమార్,జంగా రెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కుమారి రాజ రాజేశ్వరి తేజస్వి, పాలకొల్లు అదనపు జూనియర్ సివిల్ జడ్జి వివిఎస్ఎన్ లక్ష్మి లావణ్య, ఎ.ఎల్ ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్‌కు రూ.12,500 విరాళం ఇచ్చిన వైసిపి నేత జయ సరిత



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** స్థానిక ప్రెస్ క్లబ్ అదనపు భవన నిర్మాణానికి రూ. 12,500లు విరాళం ఇచ్చిన న్యాయ వాది ,రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెసు పార్టీ మహిళా విభాగం ప్రదాన కార్యదర్శి కర్రా జయ సరిత విరాళం ప్రెస్ క్లబ్ అద్యక కార్యదర్శి లుకు అందజేశారు,ఈ కార్యక్రమంలో అధ్యక్షులు విన్నకోట రమణ, ప్రధాన కార్యదర్శి, సాంబశివరావు,కోశాధికారి తోట రాం బాబు ,ముత్యాల శ్రీనివాస్,మండెల అప్పలరాజు గోపి ,నాయుడు పాల్గొన్నారు, అలాగే వైసిపి నాయకులు జోగాడ ఉమామహేశ్వర రావు.,జోగి వెంకటేశ్వరరావు ,రామాంజుల చిన మదు, వీరా మల్లికార్జునుడు, ప్రసాద్ హైమావతి కుమారి జ్యోతి పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలి : డాక్టర్ ప్రతాప్ కుమార్



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ లంకల కోడేరు సచివాలయం వద్ద. చింతపరులు సచివాలయం ఫ్యామిలీ పిజిషన్ క్యాంపు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలని. క్షయ వ్యాధి రహిత భారత్ కు సహకరించాలని కోరారు. శారీరక ఆరోగ్యములో ఆకస్మికంగా మార్పులుచుట తదితర లక్షణాలు ఉంటే వెంటనే ఏఎన్ఎం. ఆశా కార్యకర్తను సంప్రదించి తెమడ పరీక్ష చేయించుకోవాలని అలాగే ఏరియా హాస్పిటల్ నందు చెస్ట్ ఎక్స్ రే తీయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్,సర్పంచ్ గుమ్మపు పెద్దిరాజు,ఉపసర్పంచ్ కృష్ణంరాజు,ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు. పీహెచ్ఎన్ పి ఎలిజిబెత్. కార్యదర్శి శివరామకృష్ణ. సీనియర్ అసిస్టెంట్ రమేష్ బాబు,ఫార్మసీ అధికారి పీవీ స్వామి,సూపర్వైజర్ జి.ఉదయ చందర్,ఎస్.కె అమలేశ్వరరావు. ల్యాబ్ టెక్నీషియన్ లు సిహెచ్ సత్య ప్రసాద్. కే. వరప్రసాద్. బి లక్ష్మీనారాయణ. స్టాఫ్ నర్స్ లు సౌజన్య .ప్రియాంక,టీ హరిబాబు. కృష్ణవేణి. అనిత. మార్తమ్మ. సుశీల,మరియమ్మ .రోజా కమల,ఆదిలక్ష్మి. విజయశాంతి,లావణ్య,ఆశ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## మెగా డి.ఎస్.సి-2025కి ఉచిత ఆన్ లైన్ కోచింగ్

**ఏలూరు ఎడ్యుకేషన్,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం బి.సి. సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మెగా డి.ఎస్.సి –2025 పరీక్షలకు టెట్ లో అర్హత సాధించిన బి.సి,ఇ.డబ్ల్యూ.ఎస్ (ఇ.బి.సి) అభ్యర్థులకు ఉచిత ఆన్లైన్ డి.ఎస్.సి శిక్షణ కొరకు, ఇంటి వద్దనుంచే ఆన్లైన్ డి.ఎస్.సి కోచింగ్‌ను పొందుటకు జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, టిటిసి, బి.ఎడ్, కుల, ఆదాయ నివాస ధృవ పత్రములు, ఆధార్ కార్డ్,2– పాస్ పోర్ట్ సైజ్ ఫోటోస్, టెట్‌లో అర్హత సాదించిన మార్కుల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బి.సి.సంక్షేమ అధికారి ఆర్.వి.నాగరాణి సోమవారం తెలిపారు.

పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయముగా జిల్లా బి.సి. సంక్షేమం, సాదికారిత అధికారి,కలెక్టరేట్ కాంపౌండ్,ఏలూరు కార్యాలయములో సమర్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారు కల్పించిన ఈ సదవకాశమును జిల్లా అభ్యర్థులు ఉపయోగించు కోవాలని బి.సి.స్టడీ సర్కిల్, ఏలూరు సంచాలకులు తెలిపారు. ఇతర వివరములకు ఫోన్: 8686180018 ద్వారా సంప్రదించవచ్చున్నారు.

# రికార్డులు తారుమారు చేస్తే సహించేది లేదు

**– ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముట్టడి**



**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** రెవెన్యూ సిబ్బంది ఆదివాసుల రికార్డులను తారుమారు చేస్తూవస్తున్నారని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మల సురేష్ ఆరోపించారు.అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మలసురేష్ మాట్లాడుతూ బుట్టాయి గూడెం మండలం రెడ్డి గణపవరం రెవెన్యూ పరి ధిలోని వెలుతురువారి గూడెం, వాడపల్లి కాలనీ గ్రామాలలో గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములు 1/70 పరిధిలోకి వస్తాయని ఆ భూములపై చట్టపరంగా 1997 నుండి పోరాటం చేస్తే 2007వ సంవత్సరంలో గిరిజనులకు డి నమూన పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు తాసిల్దార్ గిరిజనులకు మంజూరు చేశారని గుర్తు చేశారు. 2007వ సంవత్సరం నుండి ఈ రెండు గ్రామాల గిరిజనులు సుమారు 18సంవత్సరాల నుండి ఈభూము లలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తూ వస్తున్నారని తెలియజేశారు. పట్టాదారు పాసుపుస్తములపై బ్యాంకుల నుండి రుణాలు పొందుతూ అవి తిరిగి చెల్లిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ఈభూములకు సంబంధించిన అడంగల్, వన్‌బిలను 2018లో ఒకసారి రికార్డుల నుంచి తొలగించారని అప్పుడు అఖిల భారతరైతుసంఘంఆధ్వర్యంలో గ్రామస్తులతో తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించగా యధావిదిగా రికార్డుల్లోకిఎక్కించారని తెలియజేశారు. మరల 2024 అసెంబ్లీఎన్నికల సమయంలో మరొకసారి రికార్డులను తొలగించారని అప్పుడు కూడా తమ సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించగా పొరపాటున మిస్ అయ్యాయని చెప్పి మరలా రికార్డుల్లోకి ఎక్కించినట్లుతెలియజేశారు.మళ్లీ ఇప్పుడు మూడోసారి జనవరి నెలలో అడంగల్, వన్‌బీలను మరలా తొలగించారని మళ్లీ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం రెండు గ్రామాల ఆదివాసీలు తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు మూడుసార్లు రెవెన్యూ సిబ్బంది ఈవిధంగా చేయడం బాధాకరమన్నారు. ఆదివాసి చట్టాలను, 1/70, చట్టాలను బుట్టాయిగూడెం రెవెన్యూ వారు పరిగణలోకి తీసుకోకుండాభూస్వాములకు అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. 1/70 భూములను తాము చట్టపరంగా సాధించి వెలుతురు వారిగూడెం, వాడపల్లి కాలనీ గ్రామాల్లోని భూమిలేని గిరిజనులకు భూములు పంచిపెట్టామని తెలిపారు.నాయకులు కారం రాఘవ, తగరం బాబురావు మాట్లాడుతూ భవిష్యత్తులో మళ్లీ రికార్డులు తారు మారు జరిగిన తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తరువాత జరగబోయే పరిణామాలకు రెవెన్యూ సిబ్బంది బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పివైఎల్ డివిజన్ అధ్యక్షులు కెచ్చల పోతిరెడ్డి, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ. భూషణం, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బన్నీ వినోద్, న్యాయవాది భాషా శ్యాంబాబు, కట్టం శిరమయ్య,ఊయికే వీర్రాజు,ధర్ములా అర్జున రావు, కారం అర్జునరావు, కూరం భీమన్న, కూరం రాఘవులు గొడ్డ నాగమ్మ,మడకం శాంతకుమారి, కట్టం వెంకటలక్ష్మి, కాకి శ్యామల రెండు గ్రామాల ఆదివాసీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోలీసు స్కూల్‌కు మంచినీటి శీతల యంత్రాలు అందించిన ఎస్‌పి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** పోలీసు పాఠశాల ఉన్నతికి సహకారంలో భాగంగా మంచినీటి శీతల యంత్రాలను జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ సురేష్ బహుగుణ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్రవంతికి సోమవారం ఉదయం బహుకరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని వీటిని బహూకరించామన్నారు. పబ్లిక్ పరీక్షలు సాధారణ పరీక్షల నేపథ్యంలో ప్రతి ఒకరు పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తరత సాధించాలని ఆకాంక్షించారు.

# రబీ ధాన్యం సేకరణకు సన్నాహాలు

# 118 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు : జేసి





**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో 2024–25 రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధిత శాఖలు సమన్వంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి అన్నారు. సోమవారం స్ధానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో రబీ ధాన్యం సేకరణపై జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రొక్యూర్మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో రబీ పంటకు సంబంధించి 98 శాతం ఈకెవైసి పూర్తయిందన్నారు. జిల్లాలో 3,97,807 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పాదక కాగలదని అంచనావేసి 2,25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం లక్ష్యంగా అంచనావేశామన్నారు. జిల్లాలో వరి సాగు చేయుచున్న రైతు పేరును/కౌలు రైతుల యెక్క పేర్లను కూడా ఖచ్చితముగా నమోదు చేయాలన్నారు.ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం రాగలదని అంచనావేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఆన్ లైన్ ద్వారా నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్,ఏలూరు,జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారులు అచ్యుత్ అంబరీష్,ఎం.వి. రమణ,జిల్లా పౌర సరఫరాల మేనేజర్ వి.శ్రీలక్ష్మి,జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా, డిసివో శ్రీనివాస్,డిఎస్ఓ,జిల్లాఅగ్రిబ్రెడ్‌మార్కెటింగ్ అధికారి,డి.సి.ఎం.ఎస్ అధికారి,ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ,డివిజనల్ మేనేజర్ ఎఫ్.సి.ఐ.జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమీషనర్,తూనికలు,కొలతల సహాయ కంట్రోలర్, దాన్యం కొనుగోలు సహాయ ఏజన్సీల జిల్లా అధికారులు మరియు రైస్ మిల్లర్ల సంఘం అద్యకులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కులు అంద చేసిన ఎమ్మెల్యే నాయకర్



**నరసాపురం,మేజర్‌న్యూస్:** స్థానికజనసేన పార్టీకార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నియోజకవర్గ శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన పత్రాలను లబ్ధిదారులకు అందించారు. నియోజక వర్గంలో మంద ఆనంద్‌రావుకు రూ.25 వేలు కట్నం వెంకట సూర్యనారాయణకు రూ. 31వేలు తిరుమల స్వాతికు రూ. 25 వేలు పెద్దపాటి కీర్తికి రూ.33,614చెక్కులను అందించి ఆ కుటుంబాలకు అండగా నిలిచారు.ఈ నిధులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడతాయని, లబ్ధిదారులను వారి కష్ట కాలంలో ప్రభుత్వం వారితో నిలబడి ఉందని నాయకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గుబ్బల మా రాజు, గట్టెం శ్రీను , అందే దొరబాబు నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు కొప్పాక సబ్ స్టేషన్ పరిధిలో రైతులకు విడతలవారీగా విద్యుత్

**పెదవేగి,మేజర్ న్యూస్ :** ఈనెల 25వ తేదీ మంగళవారం కొప్పాక సబ్ స్టేషన్ నందు బ్రేకర్ల మార్పిడి పనులు జరుగుతున్న కారణంగా అమ్మపాలెం,పెదకడిమి ఫీడర్లు త్రీ పేస్ కరెంటు తెల్లవారుజామున 3 మూడు గంటల నుండి ఉదయం 10 గంటల వరకు ఇవ్వబడును మరల రాత్రి పది గంటల నుండి 12 గంటల వరకు ఇవ్వబడును. అలాగే కొప్పాక, పినకడిమి ఫీడర్లు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు త్రీఫేస్ కరెంటు ఇవ్వబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆపరేషన్ కె.ఎం.అంబేద్కర్ తెలిపారు. కనుక రైతులందరూ గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# ఆసుపత్రికి సెంట్రిఫ్యూజ్ బహుకరించిన దేశం నేత నాయుడు



**నరసాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బి చర్ల గ్రామంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌కి సెంట్రీ ఫ్యూజ్‌ను బహుకరించారు. కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు సోమవారం గ్రామ పెద్దలతో కలిసి పరికరంను ఆసుపత్రి సిబ్బందికి అందించారు.ఈ సంధర్భంగా నాయుడు మాట్లాడుతూ గ్రామ పెద్దలు సూచనలు, ఆసుపత్రి సిబ్బంది కోరిక మేరకు ప్రజా అవసరాల దృష్ట్యా సెట్రిఫ్యూజ్ పరికరంను అందించడం జరిగిందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కి తన వంతు కృషి చేస్తానని సందర్భంగా తెలిపారు.ఆసుపత్రి వైద్యురాలు మాధురి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి దాతలు అందిస్తున్న సేవలతో మెరుగైన వైద్యం ను ప్రజలకు అందించ గలుగుతున్నామని తెలిపారు. రక్తాన్ని , ప్లాస్మా ను వేరు చేసే పరికరం సెంట్రి ఫ్యూజ్ ను అడిగిన వెంటనే బహుకరించిన నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని నాయుడు సేవలను గ్రామ పెద్దలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుబ్బల యమున భాను, ఎంపిపీ మైలబత్తుల సోని,సీనియర్ అసిస్టెంట్ దేగల రాంబాబు, గ్రామపెద్దలు కె పెద్దిరాజు, ఆసుపత్రి సిబ్బంది ఎన్డీఏ కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నాటు సారా అనర్థాలపై అవగాహన కల్పించాలి



**– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరంమేజర్‌న్యూస్ :** కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు ప్రొహిబిషన్ ,ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకలెక్టర్ చదలవాడ నాగరాణి 'నవోదయం' నాటు సారా నిర్మూలన కార్యక్రమంపై అవగాహన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి,జిల్లా జాయింట్ కలెక్టర్ టిరాహుల్ కుమార్ రెడ్డి,డిఆర్ ఓమొగిలి వెంకటేశ్వర్లు,ప్రొహిబిషన్,ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.ప్రభు కుమార్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి డాక్టర్ ఆర్.కుమరేశ్వరన్, తదితరులు పాల్గొన్నారు. ఆధ్వర్యంలో నవోదయం వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నాటు సారా పై ప్రజల్లో అవగాహన కలిగించి జిల్లాలో నాటుసార నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.నాటుసార తాగటం వలన ఎంతోమంది చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయి, వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయన్నారు. ఎవరైనా నాటు సారాయి తయారు చేసిన, అమ్మిన, నిల్వ ఉంచిన వారిపై పిడి యాక్ట్ నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొని 8 సం.రంలు జైలు శిక్షతో పాటు, ఐదు లక్షల రూపాయలు వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత మాట్లాడుతూ ఎవరైనా మీ పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారుచేసిన,అమ్మిన,నిల్వ ఉంచిన, గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు తయారు చేసిన రవాణా చేసిన ఎక్సైజ్, పోలీస్ అధికారులకు 14405 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారాన్ని అందిం చాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి,డిఆర్ ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ప్రొహిబిషన్,ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.ప్రభు కుమార్, జిల్లా ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి డాక్టర్ ఆర్.కుమేశ్వరన్, సర్కిల్ ఇన్స్పెక్టర్లు కె.ఎస్.వి కళ్యాణ్‌చక్రవర్తి ,కే.బలరామరాజు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాంబాబు, ఇ.స్వరాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

# కాలనీవాసుల సమస్యలు పరిష్కారం కోరుతూ ధర్నా




**నర్సాపురం,మేజర్‌న్యూస్:**మర్రితిప్ప,సీతారాంపురంనార్త్ గ్రామాల ప్రభుత్వ కాలనీవాసులకు త్రాగునీరు అందించాలని కోరుతూ కాలనీ వాసులు సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీలలో త్రాగునీరు అందకపోవడం దారుణమని అన్నారు. సీతారాంపురంలో కుళాయి వేశారని అయితే ఆకుళాయిలకు నీరు సరఫరా అయ్యే పైపులైను వేయలేదని అన్నారు.

మర్రితిప్ప కాలనీలో పైపులైన్లు వేసినప్పటికీ నీరు సక్రమంగా అందడం లేదని తెలిపారు. ఇప్పటికే త్రాగునీటి సమస్య ఉందని ప్రస్తుతం ఎండలు పెరగడంతో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయం సిబ్బంది పట్టించుకోవడంలేదని మండల, జిల్లాస్థాయి అధికారులు జోక్యంచేసుకొని త్రాగునీటి సమస్య పరిష్కారానికే తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే కాలనీవాసులతో నిరసన దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు, కోడి లక్ష్మణరావు, గుబ్బల పెద్దిరాజు,గుబ్బలవెంకటేశ్వరరావు, గంగుల జ్యోతి, నాగళ్ళ సత్యనారాయణ ,గుప్పల జయలక్ష్మి, గుబ్బల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 28 మందికి రూ 12.60 లక్షలు సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



పాలకొల్లు, మేజర్ న్యూస్: గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం వచ్చిన ధరఖాస్తులు బుట్ట దాఖలు అయ్యేవని,కూటమి ప్రభుత్వంలో నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటుందని మంత్రి రామానాయుడు అన్నారు.సోమవారం స్థానిక రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి కార్యాలయంలో 28 మంది నిరుపేదలకు రూ 12.60 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటోలను మంత్రి రామానాయుడు అందచేసారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు నిరుపేద వర్గాలకు అన్ని రకాల వైద్యం అందేలా రాష్ట్ర బడ్జెట్లో రూ 19,264 కోట్లను కేటాయించిందని అన్నారు.ప్రైవేటు ఆస్పత్రులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను రూ 1300 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.ప్రతి పేదవాడికి కార్పొరేటు వైద్యం అందేలా రూ 25 లక్షల ఆరోగ్య భీమా పథకం కూటమి ప్రభుత్వ అమలు చేయనుందని మంచి ఆరోగ్య శుభపరిణామం అన్నారు.

అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గుండె నొప్పి వచ్చిన వెంటనే చేసే రూ 45 వేలు విలువ గల ఇంజక్షను ఉచితంగా ఇస్తున్నామని,ఎన్నో ప్రాణాలు కాపాడగలుగుతున్నా మని అన్నారు.పేద ప్రజల ఆరోగ్యం కోసం ఇంటింటికి క్యాన్సరు స్క్రీనింగు పరీక్షలను 4 కోట్ల 10 లక్షల మందికి పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. కిడ్నీ రోగుల పాలిట వరంగా ప్రతి నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్లను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చేట్టి బాబు,కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు,పెనుమత్సరామభద్రరాజు,బొప్పన హరికిషోర్, ధనాని సూర్యప్రకాష్,పోట్నూరి శ్రీనివాస్,చినమిల్లి గణపతి రావు,పాల వలస తులసీరావు,బందేల భాస్కరరావు, మల్లంపల్లి ఫకీరుబాబు,పీతల శ్రీనివాసు,టిడిపి,బిజెపి,జనసేన నాయకులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సురేష్ చంద్ర స్కూల్‌కు కేకే గుప్తాచే 8 కంప్యూటర్లు అందజేత




**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు అమీనా పేటలోని పోలీసు యాజమాన్యంలో నడుస్తున్న శ్రీ సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల ప్రమాణాన్ని మరింతగా పెంచేందుకు జిల్లా వాస్తవ్యులు, సమాజ సేవకులు కేకే గుప్తా తమ ఉదార స్వభావంతో 8 కంప్యూటర్లును జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్‌కు అందచేశారు. ఈ సందర్భంలో జిల్లా ఎస్పి కె. ప్రతాప్ శివ కిషోర్ ప్రత్యేకంగా హాజరై కేకే గుప్తాకి అభినందనలు తెలిపారు. ఆయన సేవా దృక్పథం విద్యార్థులకు నూతన సాంకేతికతను నేర్చుకునే అవకాశాన్ని అందించి,వారి భవిష్యత్తును మెరుగుపరిచేలా చేయడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక కంప్యూటర్ల ద్వారా డిజిటల్ విద్యను అందించేందుకు ఈ విరాళం ఎంతో దోహదపడుతుందన్నారు. ఇలాంటి మహోన్నత సేవా కార్యక్రమాలకు మరింత మంది ముందుకు రావాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పి ఎన్ఎస్ఎస్ శేఖర్, ఎస్ బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు,ఏలూరు డి.ఎస్.పి రెడ్డి శ్రవణ్ కుమార్ ,ఏ ఆర్,ఆర్ఐ పవన్ కుమార్,ఆర్ఎస్ఐ నరేంద్ర, ప్రధానోపాధ్యాయురాలు స్రవంతి, వైస్ ప్రిన్సిపల్ వరప్రసాద్ సాయిరాం ,అధ్యాపకులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మెగా డి.ఎస్.సికి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

**ఏలూరు ఎడ్యుకేషన్,మేజర్‌న్యూస్ :**ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం బి.సి. సంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో మెగా డి.ఎస్.సి -2025 పరీక్షలకు టెట్‌లో అర్హత సాధించిన బి.సి ఇ.డబ్ల్యూ.ఎస్ (ఇ.బి.సి) అభ్యర్థులకు ఉచిత ఆన్లైన్ డి.ఎస్.సి శిక్షణ కొరకు ఇంటి వద్దనుంచే ఆన్లైన్ డి.ఎస్.సి కోచింగ్‌ను పొందుటకు ఏలూరు జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు వారి యొక్క 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, టిటిసి, బి.ఎడ్, కుల, ఆదాయ నివాస ధృవ పత్రములు, ఆధార్ కార్డ్, 2- పాస్ పోర్ట్ సైజ్ ఫోటోస్ టెట్ లో అర్హత సాదించిన మార్కుల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బి.సి.సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయముగా జిల్లా బి.సి. సంక్షేమం సాదికారిత అధికారి,కలెక్టరేట్ కాంపౌండ్, ఏలూరు వారి కార్యాలయములో సమర్పించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వారు కల్పించిన ఈ సదవకాశమును ఏలూరు జిల్లా అభ్యర్థులు ఉపయోగించు కోవాలని బి.సి.స్టడీ సర్కిల్, ఏలూరు సంచాలకులు తెలిపారు. ఇతర వివరములకు ఫోన్: 8686180018 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల, వైద్య విద్యార్థులచే సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ,ఫ్లాష్ ఎంఓపి నిర్వహించినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.సావిత్రి తెలిపారు. ఈ ర్యాలీ ని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సావిత్రి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏలూరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పి.వి.రమణ, డా.ఎస్.విజ యమోహన్ పాల్గొన్నారు. ఎస్ పిఎం డిపార్ట్మెంట్ హెచ్‌ఓడి డా.జి.గంగాభవాని మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారించదగ్గదని ప్రజలు భయపడనవసరం లేదని, ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్స్,ఇతర డిపార్ట్మెంట్ హెచ్‌ఓడిలు పాల్గొన్నారు. ఎస్ పిఎం డిపార్ట్మెంట్ సిబ్బంది స్టాఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# జిల్లాలో మొదటిగా తాడేపల్లిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం



**- 308 రైతు సేవా కేంద్రాల ద్వారా**

**6 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు చర్యలు**

**భీమవరంమేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు టి.రాహుల్ కుమార్ రెడ్డి రబీసీజన్‌కు ధాన్యం కొనుగోళ్లు ఏర్పాట్లపై సోమవారం సివిల్ సప్లయిస్,వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొదటిగా తాడేపల్లిగూడెంలో ఏప్రిల్ 3వ తేదీన ధాన్యం కొనుగోలుకేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి జిల్లాలో మండల వ్యవసాయ అధికారులు అందరు ఆయా రైతు సేవ కేంద్రాలలో ఉన్న ధాన్యం కొనుగోలుకు సంబంధించిన మౌలిక సదుపాయాలు అన్ని సరి చూసుకుని సరైన నిర్ధారణతో సర్టిఫికెట్ అందచేయాలని ఆదేశించారు. జిల్లాలో పంట కోతలు ప్రారంభ దశ నుండి ఎప్పటి వరకు జరుగుతాయి వివరాలు సమర్పించాలని అన్నారు. రైతు వద్దనుండి బయోమెట్రిక్ తప్పనిసరిగా తీసుకోవాలని ఎఫ్టిఓకి ట్రక్ షీట్ కు మధ్య సమయం ఎక్కువగా ఉండటానికి వీలులేదని చెప్పారు. ఈ ఏడాది రబీ సీజనకు సంబంధించి జిల్లాలో 308 రైతు సేవా కేంద్రాల ద్వారా ఆరు లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. సాధారణ రకం క్వింటాకు రూ.2,300 రూపాయలు,ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,320 రూపాయలు ధరను ప్రభుత్వ నిర్ణయించడం జరిగిందన్నారు. ఎవరైనా రైతులు బయట మార్కెట్లో అమ్మకాలు చేసినట్లు తెలిస్తే వారిని గుర్తించి సంబంధిత రైతు సేవా కేంద్ర సహాయకులు తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్స్ డిస్టిక్ మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు,జిల్లాలోని వ్యవసాయ సహాయ సంచాలకులు,ఎం ఏ ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబాపై పోలీసులు దాడి



**కుక్కునూర్,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని వెల్లేరు గ్రామ శివారులో నాటు సారా తయారు చేస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో స్థానిక సీఐ రమేష్ బాబు వారి సిబ్బందితో కలిసి నాటు సారా స్థావరాలపై దాడి చేసి సుమారు 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయటం జరిగిందని సారా తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ రమేష్ బాబు ఒక పాటన లో విలేకరులకు తెలియజేశారు.

# మాజీ సిఎం జగన్ పై మర్యాదగా మాట్లాడాలి : వైసిపి నేతలు



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** వైయస్సార్ కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్రెడ్డి పై బాడీ షేమింగ్ వెకిలి కామెడీ ఛీప్ స్క్రిప్టలతో వాడు, వీడు అంటూ చేసిన కూటమి ప్రభుత్వ నేతల ధోరణిని ఖండించారు. రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ప్రదాన కార్యదర్శి కర్రా జయ సరిత. ఈ సమావేశంలో జోగి వెంకటేశ్వరరావు ,జోగాడ ఉమామహేశ్వరరావు.,పెచ్చేటి కృష్ణాజి , మామిడి శెట్టి చిట్టిబాబు రామాంజుల చిన మదు గారు,గొర్రెల రాంబాబు , జక్కంశెట్టి వెంకట రెడ్డి ,వీరా మల్లికార్జునుడు పెచ్చేటి నాగేంద్ర వర ప్రసాద్ ,గంగిరెడ్ల ప్రసాద్ హైమావతి, కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరత సాధనకే 'ఉల్లాస్' నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు - దావు నాగరాజు





**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** దేశవ్యాప్తంగా సంపూర్ణ అక్షరాస్యత సాధన దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్-నవభారత సాక్షిరతా ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు పరిచేందుకు కృషి చేయాలని కైకలూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు పేర్కొన్నారు.ఈ క్రమంలో అల్లూరు జిల్లా పరిషత్ స్కూల్లో , ముదినేపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈపథకం కింద నిరక్షరాశు లకుతరగతులు నిర్వహించి పరీక్ష నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు సత్యవర్ధన్,నాగలక్ష్మి, సిహెచ్ భాగ్యలక్ష్మి , ఈడే రాణి , వెలుగు మిత్రాలు జన్ను ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లతో ఉపాధి కోల్పోతున్న మీటర్ రీడర్స్




**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో గృహ వినియోగదారులకు, వర్తక వాణిజ్య సంస్థలకు ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న కారణంగా విద్యుత్ మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోతున్నారని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, విద్యుత్తు మీటర్ రీడర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోశాధికారి కే మల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద మీటర్ రీడర్స్ ధర్నా చేసి జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా డాంగే,మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి కోల్పోతున్న విద్యుత్ మీటర్ లీడర్స్కు విద్యుత్ సంస్థలోనే విద్యా అర్హతలను బట్టి ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. విద్యుత్తు మీటర్ రీడర్స్‌కు సంబంధించి ప్రతి నెల చెల్లించే వేతనాలు ఎస్క్రో అకౌంట్ ఓపెన్ చేసి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గారావు, శంకర్ అప్పారావు,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బిస్వామి యూనియన్ నాయకులు వెంకట్రావు, ధర్మరాజు, వెంకటేశ్వర రావు, రామకృష్ణ,గోపి శ్రీధర్ రావు,అనిల్,మురళి బాబు, సూరిబాబు, అప్పలస్వామి, ఈశ్వర రావు,లక్ష్మణరావు, మీటర్ రీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మాలమహానాడు కార్యాలయంలో అంబేద్కర్ వివాహం



**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** ముదినేపల్లిలోని మాలమహానాడు కార్యాలయంలో రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షులు డా.సేవా నాగజగన్‌బాబురావు ఆధ్వర్యంలో అంబేద్కర్ వివాహం నిరాడంబరంగా జరిగింది. ఉయ్యూరు మండలం ముదునూరు గ్రామానికి చెందిన ఇంటేటి సురేంద్రనాథ్ , బంటుమిల్లి మండలం జయపురం గ్రామానికి చెందిన గరికముక్కు చంద్రిక పెద్దలు అంగీకారంతో వివాహకర్త బుద్ధిష్ట సొసైటీ ఆఫ్ ఇండియా బేతాళ సుదర్శనం వివాహ జరిపించారు. ఈ కార్యక్రమంలో నీలి లావణ్య ,భూపతి అశోక్,గరికముక్కు రాజేష్,దాసరి మణి,మట్టా సుజాత,దాకరపు నాగరాజు, పల్లెం రాజు, దాకరపు జోజిబాబు, తాడంకి వరదానం తదితరులు పాల్గొన్నారు.

# 6న జరగాల్సిన గురుకుల ప్రవేశ పరీక్ష 13కి వాయిదా

**ఏలూరు,మేజర్ న్యూస్ :** డా. బి. ఆర్. అంబేద్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌కు ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 6న నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాలతో ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా పడిందని జిల్లా సమన్వయ అధికారి బి.ఉమాకు మారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6న జరగా ల్సిన ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 13న నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. ఈ మార్పును విద్యార్థులు,తల్లిదండ్రులు గమనించా లన్నారు.

# విద్యార్థినిలకు శక్తి యాప్ పై అవగాహన



**ఏలూరు,మేజర్ న్యూస్ :** నగరంలోని సత్రంపాడు ఆదిత్య కళాశాలలో శక్తి యాప్ పై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మూడో పట్టణ ఎస్సై అప్పారావు సోమవారం ఉదయం ఏర్పాటు చేశారు. ఈ యాప్ ద్వారా ఆపదలో ఉన్న విద్యార్థులు మహిళలు యువతులు పోలీసుల సహాయం పొంది ఆపదనుండి బయటపడవచ్చు అని ఆయన వారికి సూచించారు చుట్టుపక్కల వారికి కూడా తెలియజేసి వారిని కూడా అవగాహన కల్పించాలని ఆయన వారికి తెలిపారు. యాప్ ను వినియోగించి ఎప్పుడు సహాయం కావాలన్నా సమయంతో సంబంధం లేకుండా సహాయం అందుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర అధ్యాపకుడికి బెస్ట్ పేపర్ అవార్డ్



**నరసాపురంరూరల్, మేజర్ న్యూస్ :**మండలంలో నిసీతా రామపురం లోగల స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)కళాశాలలో మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేయుచున్న డా.పి.సత్యనారాయణ రాజుకి బెస్ట్ పేపర్ అవార్డ్ లభించింది. కాకినాడ ఆదిత్య యూనివర్సిటీ, డిపార్ట్ మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ వారు నిర్వహించిన సెకండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మెటీరియల్స్ అండ్ ఎనర్జీ సైన్స్‌లో ఈ అవార్డు లభించింది.ఈ సందర్భముగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డ్ గ్రహీత డా.పి.సత్యనారాయణ రాజుని ఛైర్మన్ కె.వి.సత్యనారాయణ, కోశాధికారి కె.వి.స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డా.యస్.సురేష్ కుమార్, ఉప ప్రిన్సిపాల్ డా.ఏ.గోపిచంద్, మెకానికల్ డిపార్ట్ మెంట్ హెచ్ ఓడి డా.ఫ్రాన్సిస్ లూథర్ కింగ్ ఆద్యాపక, ఆద్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు

**– బాల బాలికల హక్కుల పరిరక్షణలో శక్తి యాప్ కీలక పాత్ర**



**కైకలూరు,మేజర్ న్యూస్:** శక్తి యాప్, సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన కైకలూరు ఇన్స్పెక్టర్ వి.రవికుమార్.డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు,రూరల్ సీఐ వి.రవి కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రూరల్ సర్కిల్ పరిధిలోని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొని ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటి నివారణ మార్గాలు, శక్తి యాప్ ఉపయోగం, సైబర్ క్రైమ్ ముప్పులు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు పోలీసులను సమీపించేందుకు,తక్షణ రక్షణ పొందేందుకు ఈ యాప్ ఎంత ఉపయోగకరమో వివరిస్తూ, యాప్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఉపయోగ విధానం పై అవగాహన కల్పించారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి హెల్ప్ డెస్క్ సేవలు – బాలల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర అని, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి హెల్ప్ డెస్క్ ద్వారా గ్రామాలలో బాలబాలికల హక్కులను పరిరక్షించేందుకు పలు చర్యలు చేపట్టబడుతున్నాయి.

ఇందులో భాగంగా చదువులు మాని వేసిన, అనాధరణకు గురైన, నిరాదరణకు గురైన, బాల కార్మికులుగా మారిన బాల బాలికలను గుర్తించి వారికి తగిన సహాయం అందించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు,గ్రామంలోని ప్రాథమి కోన్నత, పాఠశాలలకు వెళ్లకుండా మధ్యలో చదువు మాని వేసిన విద్యార్థులను గుర్తించి, వారికి తిరిగి విద్య అందించేలా చర్యలు తీసుకోవడం.పిల్లల సంరక్షణకు తల్లిదండ్రులు లేకపోవడం లేదా వారిని చూసుకునే కుటుంబం లేకపోవడం వంటి పరిస్థితులను పరిశీలించి, వారికి అవసరమైన ప్రభుత్వ పథకాలు, ఆశ్రయ హోమ్స్ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్సై రామచంద్ర రావు కైకలూరు రూరల్ ఎస్సై రాంబాబు,పోలీస్ సిబ్బంది మహిళా గ్రామ సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పలివెలలో ఇంటింటికి బైబిల్ కార్యక్రమం





**రాజోలు/ ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరుకు చెందిన శుభోద నిలయం కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా చేపట్టిన ఇంటింటికి బైబిల్ అనే కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజోలు పరిధిలోగల పలివెల గ్రామంలో శుభోద నిలయం ఫాదర్ ఆల్ ఫోన్స్ ఎలింగికల్ ఆధ్వర్యంలో ఆదివారం 60 కుటుంబాలకు చెందిన వారికి బైబుళ్ళు అంద జేశారు. ఇప్పటికీ 45 గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. క్రైస్తవులు ప్రతి ఒక్కరూ ప్రతిరోజు బైబిల్ చదవాలని, చర్చికి వచ్చే ప్రతి వారు బైబిల్‌తో సహా రావాలని ఫాదర్ ఆల్ ఫోన్స్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యారిష్ ప్రీస్ట్ కొతాడ అంతోని, పీటర్, స్టీఫెన్ ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## 25,26,27 తేదీల్లో ఏపిపిఎస్‌సి పరీక్షలు

**సెల్ ఫోన్లుకు అనుమతి లేదు : డిఆర్‌ఓ**



**భీమవరం,మేజర్ న్యూస్ :** ఈ నెల 25,26,27 తేదీల్లో జరగనున్న ఏపిపిఎస్‌సి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని డిఆర్‌ఓ ఛాంబర్ నందు జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు పరీక్షల ఏర్పాట్లు పై సమీక్షించారు. ఈ నెల 25న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, 25, 26 తేదీల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అనలిస్ట్ గ్రేడ్–2 ఉద్యోగాలకు, 26, 27న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఎపిపిఎస్‌సి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించనుందని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మ.12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సా.5 గంటలు వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. జిల్లాలో మూడు కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని భీమవరంలోని డిఎన్ఆర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, డిఎన్ఆర్ కాలేజ్ అటానమస్, వాసవి ఇంజనీరింగ్ కాలేజ్ తాడేపల్లిగూడెంలలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులను ఉదయం 8 నుంచి 9 గంటలు మధ్య, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 2 గంటలు మధ్య మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. వారు హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును కూడా తప్పనిసరిగా తీసుకురావాలి చెప్పారు.సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వాచీలు, పరికరాలను ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించడం జరగదని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఏపిపిఎస్సి అధికారులు, రెవెన్యూ, విద్యుత్, పోలీస్, మున్సిపాలిటీ, ఆర్టీసీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కృత్రిమ అవయవాల పంపిణీ




**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక దొండపాడు నందు గల ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా అవసరమైన దివ్యాంగులకు కృత్రిమ అవయ వాల పంపిణీ జరిగింది. అనంతరం సంస్థ కోఆర్డినేటర్ డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగుల పునరావాస కేంద్రం ఉండడం చాల అవసరమని దీని ద్వారా దివ్యాంగులకు అవసరమైన కృతిమ అవయవాలు,ఫిజియో దేరపి, ఆడియోలజి, స్పీచ్ తెరఫ్ తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ కేంద్రం ద్వార దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు – 681,ఫిజియో థెరపీ –782, స్పీచ్ థెరపీ –256 మరియు యూ. డి. ఐ.డి. సేవలు అందించడం జరిగిందన్నారు. ఇతర వివరాల కోసం 08812 –249297, 7386 565469లో దివ్యాంగులు సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలి



**టి.నర్సాపురం,మేజర్ న్యూస్ :** మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు బకాయిలను వెంటనే చెల్లించాలని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ డిమాండ్ చేశారు.ఉపాధి కూలీలకు జనవరి 2వ వారం నుండి నేటికీ వారు చేసిన పనికి సొమ్ములు జమకాలేదని అన్నారు.అంతే కాదు ఈ వారంతో ఆర్థిక సంవత్సరం పూర్తవుతుందని, ఏప్రిల్ నుండి అందరికీ మళ్ళీ వందరోజుల పని దినాలు మొదలవుతాయని తెలిపారు. దీని వల్ల వారికి మిగిలిన పని దినాలను సకాలంలో పనులు కల్పించక పోవటంలో విఫలమయ్యారని అన్నారు. వెంటనే ఉపాధి కూలీలకు పనిని కల్పించి, ఇప్పటి వరకు ఉన్న వారి బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. – అంబేద్కర్ విగ్రహానికి అపచారం చేసిన వారిని శిక్షించాలి – తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం, దూబచర్ల గ్రామంలో ప్రపంచ మేధావి,నవయుగ వైతాళికుడు,నవ భారత రాజ్యాంగ నిర్మాత,బహుజనుల ఆశాజ్యోతి డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమాన పరచడమే కాకుండా కోట్లాది మంది మనస్సులను గాయపరచిన ఆ ఘాతుకానికి పాల్పడిన వారిని పోలీస్ వారు వెంటనే పట్టుకుని కఠినంగా వారిని శిక్షించాలి.అంతే కాదు భవిష్యత్‌లో కూడా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారికి భయం కలిగేలా..పోలీస్ వారు చర్యలు ఉండాలని గుండె పాండురంగ అన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**టి.నర్సాపురం, మేజర్‌న్యూస్:** 25వ తేదీ మంగళవారం ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం 3గంటలవరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని,విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ జంగారెడ్డిగూడెంఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు. 33/11 కె.వి టి.నరసాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కె.వి, ఆర్వేలర్ గూడెం11 కె.వి, తిరుమలదేవి పేట 11 కె.వి, జంగిల్ క్లియరింగ్,వార్షిక మరమతులు పని నిమిత్తం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులందరూ సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## రైతుల వద్ద ఉన్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలి



**పెదవేగి,మేజర్ న్యూస్:** కోకో రైతుల వద్ద ఉన్న ఆన్ సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో పెదవేగి మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు.ఈ ధర్నాకు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆయిల్ పామ్ రైతు సంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకట్రావు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి మాట్లాడారు.

ఈ సంవత్సరం కోకో రైతులకు తగిన ధర రాక, కంపెనీలు గింజలు కొనుగోలు చేయక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో తోటలు కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ భ్రమరాంబకు, మండల ఉద్యాన శాఖ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్ బాబు,కోకో రైతులు బొప్పన పూర్ణచంద్రరావు, ఆర్.తేజ కృష్ణ, జగన్మోహనరావు, వై.లలితా కుమార్,కె.రామిరెడ్డి, జి. లక్ష్మణరావు,పి. ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

# నూజివీడు పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం



**నూజివీడు,మేజర్ న్యూస్ :** నూజివీడు పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. సోమవారం నూజివీడు పురపాలక సంఘ 2025- 2026 బడ్జెట్ అంచనాలు ప్రతి పాధనల పై కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ నూజివీడు పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా నిలిపేందుకు అందరి సమయస్ట కృషి ఎంతో అవసరమన్నారు.సుమారు రూ,51 కోట్లతో పొందుపర్చిన మొత్తం బడ్జెట్ పారదర్శంగా ప్రజలకు ఉపయోగ పడే విదంగా ఖర్చు పెడతామని, ప్రజల అవసరాలు సంక్షేమం ,అభివృద్ధికి,ప్రభుత్వంతో మాట్లాడి తమవంతు కృషి చేస్తానని,మరిన్ని నిధులు తెచ్చి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు, పట్టణ అభివృద్ధికి ఇప్పటికే రూ,30 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు మెరుగు పర్చామని అన్నారు,నూజివీడు మామిడి యార్డు అభివృద్ధికి రూ,30 కోట్లు వెచ్చించి మరింత అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి అన్నారు, సుమారు రూ,7 కోట్లతో త్వరలో తుక్కులూరు నుండి అన్నవరం బైపాసు రోడ్డు నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు,పట్టణంలో త్వరలో రూ,80 లక్షలతో స్టేడియం అభివృద్ధి చేస్తామన్నారు, ఎమ్, ఆర్,అప్పారావు కాలనీ రూ,50 లక్షలతో అభివృద్ధి చేస్తునట్లు మంత్రి తెలిపారు, పట్టణంలో ఇప్పటికే కృష్ణా శుద్ధ జలాలు నగర వాసులకు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కౌన్సిలర్ గిరీష్ మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బందికి గత 5 సంవత్సరాల నుండి సిబ్బందికి శానిటేషన్ మెటీరియల్,దుస్తులు పంపిణీ చేయక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయగా,వాటిని త్వరలో అందజేస్తామని కమీషనర్ తెలిపారు. కౌన్సిలర్ రామయ్య మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని త్వరలో పరిష్కరించాలని కోరగా త్వరలో రోడ్లు, డ్రైనేజీ పూర్తి మరమ్మత్తులు చేస్తామని మంత్రి సమాధానం ఇచ్చారు.కౌన్సిలర్ సత్యనారాయణ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పెండింగులో ఉన్న ఇంటి పన్ను నీటి పన్నులు పెనాల్టీలు వేసి రెట్టింపు వసూలు చేస్తున్నారని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ప్రజలకు భారం తగ్గించి కొంత వెసులు బాటు కల్పించాలని కోరగా ప్రభుత్వంతో మాట్లాడి వెసులు కల్పిస్తానని మంత్రి సమాధానం ఇచ్చారు. కో ఆప్షన్ సభ్యులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెత్త పై పన్ను ఎత్తివేసి ప్రజలకు ఎంతో మేలు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు,దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పెండింగులో ఉన్న రోడ్లు స్టేడియం త్వరలో పూర్తి చేయాలని కోరగా త్వరలో పూర్తి చేస్తామని మంత్రి అన్నారు,మురళీ మాట్లాడుతూ 32 వార్డులు సమపాలలో అభివృద్ధి చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లు విధులు ఎగ్గొట్టి బయట తిరగడంతో నగరంలో చెత్త పేరుకుపోతుందని మంత్రి దృష్టికి తేగా విధులు సక్రముగా చేయని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ త్రివేణి దుర్గా, మున్సిపల్ కమీషనర్ వెంకట రామిరెడ్డి, కౌన్సిలర్లు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

# భూసమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు దోహదం



**ఇరగవరం,మేజర్ న్యూస్:** భూసమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు దోహదపడతాయని ఇరగవరం రిసర్వే డిప్యూటీ తాహిసీల్దార్ వి.పోతురాజు అన్నారు.సోమవారం మండలంలోని పొదలాదలో ఏర్పాటు చేసిన పైలెట్ ప్రాజెక్ట్ రిసర్వే రెవిన్యూ గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గతంలో రిసర్వే గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కరానికి రైతులకు సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. వివిధ రకాల ఫిర్యాదులు దీర్ఘాలిక సమస్యలు పరిష్కరానికి తాహిసీల్దార్ సుందర్రాజు సూచనలమేరకు త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాటూరి చాందిని ,టీ.డి.పి. నాయకులు పాలా ధనుసంపతరావు, దొంగ లక్ష్మణరావు, వి.ఆర్.ఒ, వి.ఆర్.ఏ, పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామి ఫీల్డ్ అసిస్టెంట్ డి.పూర్ణ, ఆరోగ్య కార్యకర్తలు,అంగవాడి, ఆశావర్కర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ పాలనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం






**- ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు**

**భీమడోలు,మేజర్ న్యూస్ :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గత తొమ్మిది నెలల కాలంలో ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు, వాటి సేవలు త్వరితగతిన ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు చర్యలు తీసుకుం టున్నామని, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం మండలంలో శాసనసభ్యులు. పర్యటించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భీమడోలు ,గుండుగొలను,లే అవుట్లతో పాటు గుండుగొలను - కొవ్వూరు పాత జాతీయ రహదారిని భీమడోలు గ్రామంతో అనుసంధానం చేసే గ్యాస్ కంపెనీ రోడ్డుకు శాసనసభ్యులు ప్రారంభోత్సవం చేశారు. వీటికి ఉపాధి హామీ నిధులనుంచి రూ. 1.75 కోట్ల నిధులను శాసనసభ్యులు మంజూరు చేశారు. ఆ తర్వాత పొలసానిపల్లి గ్రామములో శాసనసభ్యుల యాత్ర కొనసాగింది. దీనిలో భాగంగా తిరుమల మిల్క్ డైరీ తమ రూ.5 లక్షల సిఎస్ఆర్ నిధులతో గ్రామ పంచాయతీకి . మంజూరు చేసి నిర్మించిన ఆర్ఓ ప్లాంట్ కు శాసనసభ్యులు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా నీటి తొలి బిందెను గ్రామ సర్పంచ్ షేక్ రహీమా బేగం హసేన కు శాసనసభ్యులు లాంఛనంగా అందజేసారు. ఆర్ఓ ప్లాంట్ కు తిరుమల డైరీ అందజేసిన సిఎస్ఆర్ నిధులకు అదనంగా అవసరమైన ఖర్చులను గ్రామపంచాయతీ సమకూర్చింది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీకి ఆర్ ఓ ప్లాంట్ అందజేసిన తిరుమల మిల్క్ డైరీ యాజమాన్యంతో పాటు, సహకరించిన శాసనసభ్యులు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పి కృష్ణంరాజులను గ్రామపంచాయతీ తరపున సర్పంచ్ సత్కరించారు. ఆ తర్వాత శాసనసభ్యులు గ్రామపంచాయతీ నిధులతో ఆధునికరించిన ఆయుస్మాన్ ఆరోగ్య మందిరం. భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ తరువాత గ్రామస్తులు సేద తీరేందుకు, పిల్లలు ఆడుకునేందుకు గ్రామ పంచాయితీ పదవ వార్డులో చేపట్టిన పార్కు పనులకు శాసనసభ్యులు శంకుస్థాపన చేశారు.

- ఆర్వో ప్లాంట్ నీళ్లు ఉచితం -సాధారణంగా దాతల సహకారంతో ఆర్వో ప్లాంట్‌లో నిర్మించిన తర్వాత వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామపంచాయతీలు ఆదాయ వనరుగా మార్చుకుంటాయి. ఇదే తరహాలో పొలసానిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీకి ఆర్ఓ ప్లాంట్ తిరుమల మిల్క్ డయరీ అందజేసింది.ప్లాంట్ ఏర్పాటుకు తీవ్రంగా కృషి చేసిన గ్రామ సర్పంచ్ సొమ్ములు వసూలు చేయాలన్న సూచనలను తిరస్కరించారు. గ్రామస్తులు అందరికీ ఆర్ఓ ప్లాంట్ తాగు నీళ్ళను. ఉచితంగా అందజేస్తామని తెలిపారు. సర్పంచ్ నిర్ణయాన్ని శాసనసభ్యులతో పాటు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

## బ్యూటిషియన్ కోర్సు సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పిడి వేణుగోపాల్**




**పాలకోడేరు,మేజర్ న్యూస్ :** పాలకోడేరు మండల సమైక్య భవనం నందు ఏర్పాటుచేసిన బ్యూటీషియన్ కోర్సును సోమవారం మండల తహసిల్దార్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళలకు జీవనోఉపాధి అవకాశాలు మెరుగుదలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ ఆర్థిక ప్రయోజనాల పథకాలను ఇప్పటికే ప్రవేశపెట్టడం జరిగి ందన్నారు. దీనిలో భాగంగా మోదటిసారిగా జిల్లాలో బ్యూటిషన్ కోర్సును ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. తొలి బ్యాచ్ లో 20 మందికి 45 రోజులపాటు శిక్షణను అందజేయడం జరుగుతుందని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని ప్రావీణ్యం పొందిన మహిళలకు పిఎంఈజిపి పథకం కింద పదిలక్షల రూపాయల వరకు బ్యాంకు గ్యారంటీ లేని రుణాలను 35 శాతం సబ్సిడీతో అందజేయడం జరుగుతుంద న్నారు. బ్యూటిషన్ కోర్సును జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ, డి ఆర్ డి ఏ సౌజన్యంతో సంయుక్తంగా ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 120 కోట్ల రూపాయల రుణాలను 22 వేల ఎస్ హెచ్ జి గ్రూపులకు ఉన్నతి, స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ, కామన్ ఇంట్రెస్ట్ ఫండ్స్ ద్వారా అందజేయడం జరిగిం దన్నారు.ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల మహిళలకు ఉన్నతి ద్వారా సున్నా వడ్డీతో రుణాలను అందజేయడం జరిగిందన్నారు. పీఎం అజయ్ పథకం ద్వారా సబ్సిడీ రుణాలను అందజేయడం జరుగుచున్నదని తెలిపారు. జిల్లాలోని మహిళల కొరకు ఏర్పాటు చేస్తున్న వివిధ జీవనోపాధి పథకాలను సద్వినియోగం చేసుకో వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకమాన్, తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రెడ్డయ్య, నీటి సంఘాల అధ్యక్షులు కే మురళీ కృష్ణంరాజు, డిఆర్డిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అసంఘటిత కార్మికుల సంక్షేమానికి పెద్ద ఎత్తున పథకాల అమలు

**- ఏపీలో 83,29,407 మంది**

**: ఎంపీ మహేష్‌కు కేంద్ర మంత్రి సమాధానం**



**దిల్లీ /ఏలూరు,మేజర్ న్యూస్ :** అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభ కరంద్లాజే సోమవారం సమాధానం ఇచ్చారు.కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ %వంష్ట్రతీఖఎ.న్రశీజ.అఅ% పోర్టల్‌ను 2021 ఆగస్టు 26న ప్రారంభించి, అసంఘటిత కార్మికుల సమగ్ర వివరాలను ఆధార్ తో అనుసంధానం చేసిందని, అసంఘటిత కార్మికులకు స్వీయ అనుమతితో యూనివర్సల్ అకౌంట్ నంబర్ రిజిస్టర్ చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు కేంద్ర మంత్రి బదిలిచ్చారు. 2025 మార్చి3 నాటికి ఆంధ్రప్రదేశ్ లో 83,29,407 మంది, దేశవ్యాప్తంగా 30.71 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.అసంఘటిత కార్మికుల సంక్షేమం ఆయుష్మాన్ భారత్ - ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్-ధన్, బీడీ, సినీ, నాన్ కోల్ గనుల కార్మికుల సంక్షేమం, ఆరోగ్య సంరక్షణకు ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం, జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఒక దేశం-ఒక రేషన్ కార్డు పథకం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన,మహాత్మా గాంధీ బుంకర్ బీమా యోజన, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, పీఎం స్వనిధి, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇవే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం నిర్దిష్ట పథకాలను అమలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

# ముగిసిన విద్యార్థుల 6 రోజుల పరస్పర అవగాహన కార్యక్రమం




**కైకలూరు, మేజర్ న్యూస్,** ఏలూరులోని సి ఆర్ రెడ్డి అటానమస్ కళాశాలలో ఎంఓయు కుదుర్చుకున్న నేపథ్యంలో వై.వి.ఎన్.ఆర్ కళాశాల విద్యార్థులు అధ్యాపకులు 6 రోజుల స్టూడెంట్స్,ఫ్యాకల్టీ ఎక్స్ చేంజ్ ప్రోగ్రాం జరిగింది. 19 తేదీ నుండి 24 తేదీ వరకు సిఆర్ రెడ్డి అటానమస్ కళాశాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా 6 రోజులు పాటు వై.వి.ఎన్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సి.ఆర్.రెడ్డి అధ్యాపకులు పాఠాలు బోధించారు. అదేవిధంగా సి.ఆర్ రెడ్డి విద్యార్థులకు వై.వి.ఎన్.ఆర్ అధ్యాపకులు పాఠాలు నిర్వహించారు. రసాయన శాస్త్ర, భౌతిక శాస్త్ర, జంతు శాస్త్ర, ఆక్వా కల్చర్ విద్యార్థులు సి.ఆర్.రెడ్డి కళాశాల లోని ప్రయోగశాలను వినియోగించుకున్నారు. అనుభవజ్ఞులైన ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకులు పాఠాలను చక్కగా బోధించారని తెలిపారు. కళాశాలలోని గ్రంథాలయం రీసెర్చ్ ల్యాబ్ జంతు శాస్త్ర, ఆక్వా కల్చర్, వృక్ష శాస్త్ర మ్యూజియాలను సందర్శించి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. ఆరు రోజులు ముగింపు సభలో ఇరు కళాశాలకు చెందిన అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ కె.విష్ణు మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఏ విధంగా తమ భవిష్యత్తుని నిర్మించుకోవాలి తెలియజేశారు. కె ఏ రామరాజు వై శ్రీలత ఫ్యాకల్టీ ఎక్స్ చేంజ్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినం దించారు. అలాగే కళాశాల యాజమాన్యం అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ఐయల్‌టిసి ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన వైఎన్ కళాశాల విద్యార్థులు




**నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని రస్తుం బాధ పంచాయతీలో గల అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్లో జరుగుతున్న హస్త కలల ఎక్స్పోను వైయన్ కళాశాల విద్యార్థులు పరిశీలించారు. ఈనెల 21నుండి కేంద్ర ప్రభుత్వ హస్తకళల శాఖ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్‌ను కొనసాగిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సంప్రదాయంగా తయారు చేస్తున్న వస్తువులను ఈ ప్రదర్శన ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. పరిసర ప్రాంత గ్రామాల నుండి అధిక సంఖ్యలో పాల్గొని సంప్రదాయ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున ప్రజలు ఎగ్జిబిషన్ ను తిలకించేందుకు హాజరు కావడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. 85 స్టాల్స్ ద్వారా ప్రజలకు వస్తువులను ప్రదర్శన, అమ్మకాలు చేపడుతున్నారు. సోమవారం ఈ స్టాల్స్ ను వైయన్ కళాశాల పరిశీలించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్ కు సంబంధించిన వివరాలను ఈపీ సిహెచ్ దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్ కలవు కొలను నాగా తులసీరావ్ విద్యార్థులకు వివరించారు. హస్త కలల యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వైయన్ కళాశాల ప్రిన్సిపాల్ చింతపల్లి కనకారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, చిన్నమిల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి : జిల్లా ఎస్పి ఆదేశం



ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కే.ప్రతాప్ శివ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యలపై 36 ఫిర్యాదులను అదనపు ఎస్పీ అడ్మిన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ నాగాలు తెలుగు గా ఢిల్లీ కలకత్తా ,మద్రాస్ ఇతర ప్రాంతాలలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్, సిబిఐ అధికారుల మని ఫోన్లు చేసి మీరు గతంలో మీ ఎకౌంటు ద్వారా మత్తుపదార్థాలను రవాణా చేసినట్లు మీపై కేసులు నమోదు చేశారని చెప్పి బెదిరిస్తూ మీపై కేసు ఉపసంహరించుకోవాలంటే డబ్బులను ఈ అకౌంట్ కి పంపించమని చెప్పి వచ్చేటటు వంటి ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తలను తీసుకోవాలని.అధికారులు ఎవరు కూడా ఫోన్ ద్వారా మీ పై కేసు నమోదు చేసినట్లు తెలియ చేయరు అని అది గమనించి సైబర్ సెల్ అధికారులకు సమాచారాన్ని 1930కి తెలియ చేసిన వారు మీకు సహాయ సహకారాలు అందిస్తారని ఆయన తెలియచేసినారు.సైబర్ నేరగాళ్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా స్మార్ట్‌గా వ్యవహరించాలని, మీ చుట్టూ ప్రక్కల వారికి కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 36 ఫిర్యాదులు స్వీకరించగా వాటిపై చట్ట ప్రకారం త్వరితగతిన పరిష్కారం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశించారు.

# సిఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు : జిల్లా ఎస్పి





**పోలవరం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 27న పోలవరం ప్రాజెక్ట్ సందర్శించనున్నారు. ముఖ్య మంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను సమీక్షించడానికి సోమవారం జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, పోలీసు ఆధికారులతో కలిసి ముఖ్య మంత్రి పర్యటన ప్రదేశాన్ని పరిశీలించారు.ఈసందర్భనలో ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, హెలికాప్టర్ దిగే ప్రదేశాలు,ప్రజా రవాణా నియంత్రణ, విఐపీ భద్రత, శాంతి భద్రతలు, అత్యవసర సేవల అందుబాటు తదితర అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి అని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భద్రతా చర్యలను మరింత కఠినతరం చేయాలని అధికారులకు సలహాలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి ఆటంకాలు లేకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచనలు సలహాలు,ఆదేశాలు ఇచ్చారు. ఈ సమీక్షలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, ప్రత్యేక భద్రతా బలగాలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు, ఏలూరు డి.ఎస్.పి డిశ్రావణ్‌కుమార్, పోలవరం డిఎస్పి ఎం వెంకటేశ్వరరావు,ఎస్.బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు,ఏ.ఆర్ ఆర్ ఐ పవన్ కుమార్, పోలవరం ఇన్స్పెక్టర్ బాల సురేష్,పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ ,రెవెన్యూ,పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆరోగ్యం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** వెంకటాపురం గ్రామంలో 15వేల ప్రీ-మోన్సూన్ డ్రై సోయింగ్ (ఎంపిడిఎస్) కిట్ల పంపిణీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమం స్థానిక రైతుల మధ్య ప్రకృతి వ్యవసాయ విధానాలను ప్రోత్సహించటం జరిగింది. వ్యవసాయ సంయుక్త డైరెక్టర్ (జెడిఎ) ఎస్‌కె.హబీబ్ బాషా అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్(డిపిఎం)వెంకటేష్,డివిజనల్ వ్యవసాయ అధికారులు (ఎఒ) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో డిపిఎం,పిఎండిఎస్ పద్ధతులను స్వీకరించడానికి సంబంధించిన 14 లాభాలను వివరించారు. వారు రసాయన వ్యవసాయ విధానాలను వదిలి ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.ఈ మార్పు మట్టిలో పర్యావరణ స్నేహితమైన పౌష్టికతను పెంచి, రైతులకు మంచి దిగుబడులు,పురుగులు, ఔషధ వృక్షాలు సమస్యలను నివారించడంలో సహాయపడతుందని వారు అంచనా వేసారు.ఈ కార్యక్రమంలో అనేక మంది రైతులు ఉత్సాహంగా పాల్గొని పిఎండిఎస్ కిట్లను పొందడానికి ఆసక్తి చూపించారు. జెడిఎ రైతులకు పిఎండిఎస్ కిట్లు పంపిణీ చేశారు.

## పురవీధులలో ఊరేగితున్న గ్రామదేవత బలుసులమ్మ తల్లి





తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ : తాడేపల్లిగూడెం గ్రామదేవత శ్రీ బలుసులమ్మ తల్లి ఉగాది ఉత్సవాల ను పురస్కరించుకొని ఈరోజు 9,10,11,12 వార్డులలో అమ్మవారు గరగల నృత్యాల తో,తాళమేళాలతో వాయిద్యాలతో పుట్టింటి పాశం వారి ఇంటివద్ద పాన్పు కార్యక్రమానికి సిద్ధమవుతున్న అమ్మవారు. 11 సంవత్సరాల క్రితం అంగరంగ వైభవంగా జాతర జరుగగా మరలా తిరిగి తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రోత్సాహంతో ఉగాది ఉత్సవాల నిర్వహిస్తున్నారని త్వరలో జాతర మహొత్సవానికి కూడా రంగం సిద్ధం చేస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారులు తెలియజేశారు. శ్రీరంగం అంజిబాబు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ నేతృత్వంలో వార్షిక రజక ఆసాదులతో ఊరేగింపు నిర్వహించారు. ఇళ్ళ ముందుకు వచ్చిన అమ్మవారు కు పసుపు నీళ్లతో వారు పోశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు అడ్డాలనరసింహారావుసత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : డిఆర్ఓ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పిజిఆర్‌ఎస్) కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావుతో పాటు ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె. భాస్కర్, దేవకిరాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్.ఎస్. కృపావరం, హౌసింగ్ పిడి సత్యనారాయణ, సర్వేశాఖ ఎడి షేక్ మహ్మద్ అన్సారీ లతో కలిసి 336 అర్జీలు స్వీకరించారు. జిల్లాలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి నాణ్యతగల ఎండార్స్ మెంట్ అందజేయాలని డిఆర్ఓ అధికారులకు సూచించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పోలీస్,రెవిన్యూ,పౌరసరఫరాలు తదితర శాఖలకు సంబంధించి సమస్యల పరిష్కారంకోసం పలు వినతులు అందాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.